చెట్ల కొమ్మల తొలగింపు..



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: 'పొంచి ఉన్న ప్రమాదం' సాక్షిలో ప్రచురితమైన కథనంపై విద్యుత్‌శాఖ, జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ విభాగం అధికారులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం చర్లపల్లి విద్యుత్‌శాఖ అధికారులు, జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ సిబ్బందితో కలిసి చర్లపల్లి డివిజన్, సుభాష్‌నగర్ కాలనీలో విద్యుత్ తీగలపై ప్రమాదకరంగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించారు. సమస్యకు పరిష్కారం చూపిన 'సాక్షి' దినపత్రికకు సుభాష్‌నగర్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్ల బదిలీ

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాప్రా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో చైన్‌మెన్లు బదిలీ అయ్యారు. ఎల్బీనగర్ జోనల్ పరిధిలో చైన్‌మెన్ల బదిలీల్లో భాగంగా కాప్రా సర్కిల్‌కు చెందిన చైన్‌మెన్లు గంగాధర్, వెంకటేష్, బాలరాజ్‌ను బదిలీ చేస్తూ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర్‌ను హయత్‌నగర్ సర్కిల్‌కు, వెంకటేష్‌ను ఎల్బీనగర్ సర్కిల్‌కు, బాల్‌రాజ్‌ను ఉప్పల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. వారి స్థానంలో హయత్‌నగర్ సర్కిల్‌లో చైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.శ్రీనివాస్, ఎల్బీనగర్ సర్కిల్‌లో చైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న పి.జ్ఞానేశ్వర్‌ను కాప్రా సర్కిల్‌కు బదిలీ చేశారు.

ఘనంగా కార్గిల్ దివస్



కార్గిల్ దివస్‌లో పాల్గొన్న విద్యార్థులు

మల్లాపూర్: కార్గిల్ దివస్ సందర్భంగా నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని మాట్లాడుతూ..నేటి విద్యార్థులే రేపటి పౌరులని రక్షణ రంగంలో విద్యార్థులు ముందు వరసలో ఉండాలన్నారు. విద్యార్థులు సైనిక దుస్తులతో చేసిన సాంస్కృతిక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నవనీతారావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీనకుమార్, కిషోర్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేత



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మౌలాలి: ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలను మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మౌలాలి డివిజన్‌కు చెందిన లబ్ధిదారులు రాజుకుమార్‌కు రూ. 2.20 లక్షలు, శివాన్షీ శివశంకర్‌కు రూ.60వేల సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, భాగ్యనందరావు, మహేష్, రాజు, కాశీయాదవ్, బాలస్వామి, చందు, ఉష, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల విద్యా సమగ్ర శిక్షణ అదనపు డైరెక్టర్ రాధారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తే భవిష్యత్తులో భారత్ వైజ్ఞానిక రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతుందనడంలో సందేహం లేదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, పంజ్వానీ, కో ఆర్డినేటర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు

- కాలనీవాసులతో చర్చలు
- జీప్లస్–3,4 అంతస్తుల్లో పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు

భగత్ సింగ్ నగర్‌లో అదనపు కలెక్టర్ పర్యటన



భగత్‌సింగ్ నగర్‌లో పర్యటిస్తున్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడిపల్లి: మేడిపల్లి మండలం, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె కాలనీ వాసులతో మాట్లాడుతూ ఇరుకైన ఇళ్లల్లో ఉంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వం జీ ప్లస్ 3,4 పక్కా ఇళ్లను కట్టించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అందుకు అందరూ సుముఖత తెలపాలని కోరారు. పక్కా ఇళ్లతో పాటు ప్రభుత్వం అవసరమైన మౌలిక వసతులతో పాటు విద్య, వైద్య సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్, కార్పొరేషన్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను సందర్శించి మహిళలను అభినందించారు. అనంతరం వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, మేడిపల్లి తాసీల్దార్ హసీనా, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డీఈ సాయినాథ్ గౌడ్, ఏఈ వినీల్‌కుమార్ గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, ఎస్‌ఐ ప్రవీన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది, కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్



శామీర్‌పేట మండలంలో..

శామీర్‌పేట్: పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని, చిన్న ఇళ్లలో నివాసం ఉండే పేదలకు జీ ప్లస్ 3 పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. శుక్రవారం ఆమె శామీర్‌పేట మండలం, తూంకుంట మున్సిపాలిటీలోని బిట్స్ కాలనీ, శివ శివాని కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ప్రభుత్వం జీ ప్లస్ 3,4 అంతస్తుల్లో పక్కా ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్న చిన్న స్థలాల్లో ఉంటూ ఇబ్బంది పడే వారికి పక్కా ఇంటితో పాటు, విద్య, వైద్యం. అవసరమైన మౌలిక వసతులను సైతం కల్పిస్తుందన్నారు. అనంతరం కాలనీలో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవి బుద్ధనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా 33/11 పీఅండ్‌టీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం10.00 గంటల నుంచి 11.00గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, బుద్ధా నగర్, మల్లికార్జున నగర్, వరంగల్ హైవే ఏరియా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ హరినాథ్ ఓ ప్రకటనలో తెలిపారు.

11కేవి చెన్నారెడ్డి తోట ఫీడర్ పరిధిలో..

33/11 కేవి పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11.30 మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాఘవేంద్ర నగర్, మల్లికార్జున నగర్,అరోరా పీజీ కాలేజ్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేయనున్నారు.

- 11కేవీ వరంగల్ హైవే ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00సాయంత్రం 5.00 వరకు బుద్ధానగర్, వరంగల్‌హైవే, బోడుప్పల్ మెయిన్ రోడ్డులో కరెంట్ నిలివేస్తారు.

11కేవీ వెంకటసాయి నగర్ ఫీడర్ పరిధిలో..

- 33/11 కేవి చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం10.00 గంటల నుంచి 10.30 గంటల వరకు శివగణేష్ నగర్, ఎంఎల్ఆర్ కాలనీ, వెంకటసాయి నగర్,సాయి రెసిడెన్సి, ఫ్రీ విలేజ్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.
- 11కేవి ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9.00 గంటల నుంచి 9.30గంటల వరకు ఆర్టీసీ కాలనీ,ఆర్ఆర్ నగర్, ఆదర్శ్ నగర్ ఏఈ హరినాధ్ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.
- 11కేవీ కాచవానిసింగారం ఫీడర్ పరిధిలోని 33/11 ప్రతాప్‌సింగారం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు ముత్వేల్లిగూడ ,శ్రీధర్‌హోమ్స్, మహేశ్వరికాలని, కాచవాని సింగారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11కేవీ శివాలయం ఫీడర్ పరిధిలో..

33/11 పీర్జాదిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం11.00 గంటల నుంచి 12.00గంటల వరకు శంకర్ నగర్,కెనరానగర్,న్యూసాయినగర్,అన్నపూర్ణ కాలనీ,గణేష్ నగర్,శ్రీరామ ఆర్టీసీ కాలనీలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది.

మారుతీనగర్ ఫీడర్ పరిధిలో..

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భవానినగర్, మారుతీనగర్, శ్రీసాయి ఎన్‌క్లేవ్, మణికంఠనగర్, శుభోదయ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పద్మావతికాలనీ, ఆర్ఎస్ఎస్ కాలనీ, గ్రీన్‌సిటీ కాలనీ, భీంరెడ్డినగర్, శ్రీలక్ష్మినగర్, ఎస్‌వి ఎస్ కాలనీ, అశోక్‌నగర్, అనఘాపురి కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లక్ష్మీనరసింహ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు మేప్లవర్ హైట్స్, లక్ష్మీనరసింహ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు.

అమ్మవారికి 1,116 చీరలతో ప్రత్యేక అలంకరణ



బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీ మాతా నిమిషాంబదేవి అమ్మవారిని శ్రావణ శుక్రవారం సందర్భంగా 1116 చీరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే ఆయురారోగ్యాలు, సిరి సంపదలు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శులు అశోక్ కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచర్ల శ్రీనివాస్ రావు, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటాం



స్టేషనరీ అందజేస్తున్న త్రిశక్తి సేవా సమితి సభ్యులు

మల్కాజిగిరి: విద్యార్థులకు చేయూత అందించేందుకు త్రిశక్తి సేవా సమితి ఎల్లప్పుడూ ముందుంటుందని సమితి వ్యవస్థాపకులు సూర్యకుమారి అన్నారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యావికాస్ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పదవతరగతిలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన వారికి నగదు పారితోషికం అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భాస్కరశర్మ, జ్యోతి, ఉష, సమయ, శేషు, రాజేశ్వరి, డాక్టర్ రమేష్, రామ సాయి బాబు, రమణాచారి, రవికుమార్, పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో కంట్రోల్ రూం ఏర్పాటు

మేడిపల్లి: నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను పరిష్కరించేందుకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పీర్జాదిగూడ నగరపాలక మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు తెలిపారు. వరదల కారణంగా లోతట్టు కాలనీల ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ కార్యాలయంలో 24 గంటల పాటు కంట్రోల్ రూంలో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వర్షాలు, వరదల కారణంగా సమస్యలు ఏర్పడితే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని కోరారు. కంట్రోల్ రూం ట్రోల్ ఫ్రీ నంబర్–18004257577, హైడ్రా కంట్రోల్ రూంనంబర్–9000113667 సమాచారం అందించాలని సూచించారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి




ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

ఉప్పల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన డీసీపీ మనోహర్‌తో కలిసి ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ పరిస్థితిని పరిశీలించారు. వాహనాలు సజావుగా సాగుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా సన్నాహాలు చేపట్టాలన్నారు.

మున్నూరు కాపులు సంఘటితం కావాలి

శామీర్‌పేట్: రాష్ట్రంలోని మున్నూరు కాపులు సంఘటితం కావాలని రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు అన్నారు. ఛలో వేములవాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారంగ రాజరాజేశ్వరి గార్డెన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన ఆయన మార్గ మధ్యంలోని శామీర్‌పేట చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మున్నూరు కాపు సంఘం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శామీర్‌పేట కట్టమైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్నూరు కాపుల ఆత్మగౌరవ బాహుటా ఎగురవేయడానికి ర్యాలీ నిర్వహిస్తున్నామని, మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటయ్యేంతవరకు పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటూ సంఘం సమస్యలను పరిష్కరించుకుంటామన్నారు. కార్యక్రమంలో మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ, రాష్ట్ర జనరల్ సెక్రెటరి పెంటన్న, మహిళా నాయకురాలు శివరంజని, వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, నరసింహారావు, మధు, రవి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మరమ్మతు పనులు



చిలుకానగర్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

ఉప్పల్: చిలుకానగర్ రోడ్డులో మ్యాన్ హోల్ కుంగిపోవడంతో జలమండలి అధికారులు చేపట్టిన మరమ్మతు పనులు ప్రమాదకరంగా మారాయి. అసలే వర్షాకాలం ప్రధాన రహదారిపై దాదాపుగా 10 ఫీట్లకు పైగా పెద్ద ఎత్తున గొయ్యి తవ్వి పనులను చేపట్టారు. అయితే గోతి చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. పని చేసే కార్మికులు సైతం ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండానే పనులు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు రోడ్డుపై వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగుతున్నాయి. అధికారులెవరూ పనులను పరిశీలించక పోవడం గమనార్హం. ఈ విషయం తెలుసుకున్న చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి స్వచ్ఛ హైదరాబాద్ సాధనకు కృషి చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏఎస్‌రావు నగర్‌లో స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డితో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలకు వారికి ఎంత పారితోషకం ఇచ్చినా తక్కువేనన్నారు. ఒక్కరోజు వారు లేకుంటే నగరం అస్తవ్యస్థంగా తయారవుతుందని, వారితో ప్రతి ఒక్కరూ గౌరవంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్ వైజర్ సుదర్శన్, స్థానిక నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నాచారంలో జోనల్ కమిషనర్ పర్యటన



నాచారంలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి శుక్రవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యటించారు. ఈ సందర్భంగా నాచారం ఓల్డ్ విలేజ్‌లో అంగన్ వాడీ స్కూల్ నిర్మించాలని కాలనీ వాసులు జోనల్ కమిషనర్‌ని కోరారు. నాచారం వార్డు కార్యాలయాన్ని నిర్మించినా లిఫ్ట్ సౌకర్యం లేక పోవడంతో ప్రారంభించలేదని వెంటనే నిధులను మంజూరు చేయాలన్నారు. పటేల్‌కుంట చెరువు వద్ద సివరేజీ డైవర్షన్ పనులు, చెరువు సుందరీ కరణ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. రెడ్డి స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్‌ను నిర్మించాలని, నాచారం డివిజన్‌లోని ఐదు ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు. కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ బాలకృష్ణ, ఏఈ వినీత్, బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, ఎర్రం శ్రీనివాస్‌రెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి వినతి



మల్కాజిగిరి/అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటీసీ పరిధిలో అదనపు రోడ్ల నిర్మాణం, ఆర్‌కెపురం ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు టెండర్ పక్రియ త్వరితగతిన చేపట్టాలని కోరామన్నారు. ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని హిందూ స్మశాన వాటికలో డంపింగ్ యార్డు ఎత్తివేయాలని, జొన్నబండ ప్రాంతంలో సర్వే నెంబర్ 22, 23 తోపాటు సర్వే నెంబర్ 582,583లో భూములు కబ్జా కాకుండా , నూతన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దని సూచించామన్నారు. మచ్చబొల్లారం డివిజన్ గ్రీన్‌ల్యాండ్స్ ఎన్‌క్లేవ్, కీర్తినగర్, సాన్వీ విలాస్, కాశీపురం, ఎంఈఎస్ కాలనీ, ఎంహెచ్ఆర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, దయానంద్‌నగర్ ట్రాక్ వద్ద నూతనంగా నిర్మించిన స్టేషన్‌కు రాధాకృష్ణనగర్ రైల్వేస్టేషన్‌గా నామకరణం, ఆల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రానికి స్థలం, ఆర్‌కెనగర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు ట్రాక్ సూట్స్ అందజేస్తున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

అల్వాల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సమతానగర్‌లోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేలో ఇండియా సైక్లింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా క్రీడాకారులకు ట్రాక్ సూట్లు, జెర్సీ, షూస్ అందచేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి, సైక్లింగ్ కోచ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న చెరువు పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రామంతాపూర్: భారీ వర్షాల కారణంగా రామంతాపూర్ చిన్న చెరువులో వరద నీరు చేరి చెరువు నిండుకుండలా మారింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా శుక్రవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు నీటితో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు.

నీరు వదిలితే అడ్డుకుంటాం

చిన్న చెరువు పూర్తిస్థాయిలో నిండిపోవడంతో స్థానికులకు ఇబ్బంది కలుగకుండా నీటిని తూము ద్వారా కిందకు వదిలేందుకు అధికారులు వచ్చారని తెలుసుకున్న రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మల్లయ్య, పూస సత్తయ్య, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అదే విధంగా చిన్న చెరువు ఎఫ్‌టీఎల్ వరకు వచ్చిన వరద నీటిని కిందకి వదలడానికి ప్రయత్నిస్తే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శుక్లజ, ఏఈ సుధీర్, హరిలాల్, గంగపుత్ర సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి విద్యార్థి సదస్సు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బాల్కసుమన్, గెల్లు శ్రీనివాస్

మల్లాపూర్: మల్లాపూర్ వీఎస్ఆర్ గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి విద్యార్థి సదస్సు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఏర్పాట్లను పరిశీలించారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సులో హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ హాజరుకానున్నారు. శిక్షణ తరగతులకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్వీ నేతలు రానున్నట్లు సమాచారం దాదాపు 2 వేల మందికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కాప్రా: గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్ స్వర్ణరాజ్‌ను కోరారు. శుక్రవారం కార్పొరేటర్ గాంధీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ సమస్యలు వివరించారు. స్థానికుల వినతిపై స్పందించిన ఆయన రోడ్ల నిర్మాణం, యూజీడీతో పాటు కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ త్వరలోనే చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాలనీ వాసులు మహేష్, సత్యనారాయణ, దశరథ్, హరిబాబు, మనోజ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు సమస్యలు వివరిస్తున్న గాంధీనగర్ వాసులు